


# రొమాంటిక్ హంట్

**- వేణు**

పాలరాతి బొమ్మ ప్రాణం పోసుకుని పరుగులు తీస్తోందా?

వనకన్య దారితప్పి బిక్కుబిక్కుమంటూ నిశ్శబ్దాన్ని తోడుచేసుకుని గమ్యంకోసం ప్రాకులాడుతోందా?

వర్ణనలు. ఉపమానాలు. ఊహాలే అయినా వాస్తవంలో నడచిపోతున్న ఆ అందాన్ని చూసిన ప్రతి మనసుకీ అందేది అదే.

సౌజన్య నడుస్తోంది.

రాత్రి పది.

నడకలో ఆత్రుత.

అంత రాత్రి ఆడదానికి ఆత్రుత సహజమే!

అది ఆడదాని బలహీనత కాదు

కలియుగ పురుషుని గొప్పతనం!

వెండి పట్టెల మువ్వలు ఊసులతో. సరసాలతో అడుగడుక్కీ అల్లరిచేస్తూ ఘల్లుమంటున్నాయి.

పాల పాదాలకు వెండి పూతలా....

పిల్లతెమ్మెర తాకినా ఉలిక్కిపడుతోంది సౌజన్య.

రోడ్డుమీద మీగడపరచినట్టుగా వెన్నెల....

చూపు చివర రోడ్డు వంపు....కుడివైపు....ఆ తర్వాత ఎడంవైపు....మరో ఫర్లాంగు.

అంత దూరం మనసు ఊహిస్తే....గుండె టకటకా టైంబాంబులా కొట్టుకుంటోంది.

తెల్లని పాదాలు కందిపోయి పారాణి పూసినట్లు-

కళ్ళకి ఎదురుచూపులుతప్ప ఏం తోచడం లేదు.

ఓ క్షణం....

అడుగులు ముందుకుపడుతుంటే అటూ....ఇటూ రెపరెపలాడే చీరంచును చూడ్డం

ఓ క్షణం ...

మెర్క్యురీ లైట్ల కాంతితో మేకప్ చేసుకున్న నల్లని పొడవాటి తారు రోడ్డును కొలవడం

మరో క్షణం....

కాలాన్ని కొలుస్తూ ముందుకు పోతున్న మూడు ముల్లుల్ని చూడ్డం....చూస్తే....పదింపావు.

చూపులు ఎదురుచూపులయితే....

క్షణాలు యుగాలే

తొందరలో తడబాటు

ఊపిరి నిట్టూర్పులుగా వస్తోంది.

వాలుజడ నడుముపడే అవస్థను చూస్తూ ఊరుకోలేక గిలగిలా గింజుకుంటోంది

చివర్న వదిలేసిన మూడు పాయలూ....మూడు తలల నల్లత్రాచులా వెన్నెల్లో మరింత మెరుస్తూ ...నిగనిగా....

సాయంత్రం పెట్టుకున్న దోసెడు మల్లెలూ వెన్నెలకే పాలిపోయినా....కొనప్రాణంతో వున్నట్టు ఊపిరి గుబాళింపు.

నుదుటిపై....

జున్నుముక్కల్లా తొణకిసలాడే బుగ్గలపై...

ముక్కెరను మోస్తున్న ముక్కుపై....

మెరిసే ముత్యాల్లా....చిరుచెమట.

మంచు కురిసిన ఉదయం విచ్చుకున్న ముద్దమందారంలా....సౌజన్య.

అక్కడక్కడా నీలి పువ్వులతో. పచ్చని అంచుతో తెల్లని ఆర్గండీ చీర.

నగరం పాపిడిలోంచి జరజరా....సౌజన్య....పాపికొండల సందుల్లో మల్లెపువ్వులా తెల్లగా సాగిపోతున్న సెలయేరులా....

"అది కబుర్లలో పడిందంటే వదిలిపెట్టదు. చివరికి అవస్థనాది....లేటయిపోతుంటే చీకటి పడిపోతుందంటే?....నగరంలో రాత్రేవిటే పిచ్చిమొహమా....అంటూ కుర్చీకి కట్టేసింది"

"రిక్షాలో ఇంటికొస్తే అంతేసంగతులు. ఆటోలు అసలేలేవు....బస్సుకోసం నిలబడ్డం కన్నా నడవడం ఉత్తమం అని ఇలా ఇరుక్కుపోయింది"

సౌజన్యమీద సౌజన్యకే జాలి.

అక్కడక్కడా పట్టించుకోని ఆకారాలు తిరుగుతున్నా....ఒంటరి ఊహ.

"పుచ్చపువ్వులా మెరిసిపోతానట....ఆ మెరుపుకి దాసోహమనే అబ్బాయిలు....అక్కడా....అక్కడా....ఎందరో! గొప్పే....మరి....అంత అందం....ఇంత రాత్రి....ఒంటరిగా....ఎవడయినా?

గుండె క్షణం ఆగిపోయినట్టయింది.

వెధవ ఆలోచనలు

డెవిల్స్ వర్క్‌షాప్.

ఈ క్షణం మనసుకీ.... మెదడుకీ దోస్తీ....

ఊహ....ఆలోచన....తల దానంతటదే తిరిగింది.

చూడకూడదనుకుంటూనే చుట్టూ చూడాలనీ....ఎడంవైపు చుట్టేసిన చూపు....కుడివైపు పూర్తిచేస్తూ. పూర్తిచేస్తూ....లిప్తపాటు. ఉలికిపాటు.

మళ్ళీ వెనక్కి తిరిగి చూసింది సౌజన్య.

విసురుగా తిప్పేసుకుంది తలను

ఆ విసురుకు తట్టుకోలేని రెండు మల్లెలు అంతదూరం అదిరిపడ్డాయి.

జడ నడుమును కౌగిలించుకుంది.

---

**చూడకూడదనుకుంటూనే చుట్టూ చూడాలనీ....ఎడంవైపు చుట్టేసిన చూపు....కుడి వైపు పూర్తిచేస్తూ, పూర్తిచేస్తూ....లిప్తపాటు, ఉలికిపాటు మళ్ళీ వెనక్కి తిరిగి చూసింది సౌజన్య. విసురుగా తిప్పేసుకుంది తలను. ఆ విసురు తట్టుకోలేని రెండు మల్లెలు అంతదూరం పడ్డాయి**

---



"ఎవడు?.... వాడెవడూ?.... ఎవరూ లేరను కుంటుంటే.... వెంటపడే వీడెవడూ .... చూడగానే వెకిలినవ్వు"

'కాదు'

'మరి'

'ముత్యాలు బుద్ధిగా, కుదురుగా, వరుసగా కూచున్నట్లు'

"మధ్యలో ఇదెవరూ?"

"మనసుని"

'ఛ.... ఊరుకో'

'అడుగులో అడుగువేస్తూ తనవెంట.... ఇలా ఎక్కడ్నించి ఫాలో అవుతున్నాడో'

చూపుతోనే కౌగిలించుకున్నాడు.

అంతదూరంలో అందంగా.

గుభేలుమని ఉరుములా గుండె....

అదుముకుంది.... గుండ్రని గోల్డ్ లాకెట్ మెత్తని వెన్నముద్దలకు గుచ్చుకుంది.

లాకెట్ ది లక్కీయస్ట్

తొందర దానికదే పెరిగింది.

అడుగులు మరింత వడిగా.

మువ్వలు మరింత గట్టిగా ఘల్లుమంటున్నాయి.

'ఇంకా వస్తున్నాడా?'

'ఛీ ఛీ మళ్ళీవాడి ఆలోచనే.... బుద్ధిలేదు నీకు'

'వస్తున్నాడా'

'చూస్తే'

'ఎందుకు చూడాలి'

'చూస్తే ఏమ్మా'

'చూద్దాం' . చూసేసింది.

అంత దూరంలో.... అల్లంతలో.... పెదవులు మూసుకున్నా నవ్వుతున్నాయి కళ్ళు.

"అందగాడే.... అయినా అతడికిదేంపాడు బుద్ధి?"

'ఎందుకో వెంటపడుతున్నా.... తిట్టాలనిపించడంలేదు'

'నీకిదేం పాడుబుద్ధి'

చూడగానే చూపుతో ముద్దులు.... కళ్ళని తడుముకుంది.

ఎదలో సన్నని సెగ..

ఊహాలు వంకరగా.

ఇదేవిటీ? ఇలా అయిపోతోంది తను? వెంటపడే వాడికోసం..

థ్రిల్.. సైకలాజికల్ థ్రిల్

చూపుతో పులకింత.

సైగలతో సరసం....

భయంలో తృప్తి

అసహ్యంలో ఆకర్షణ.

"ఏం చేస్తాడు?"

"తరుముకొచ్చేది మగాడు.... ఏం చేస్తాడేవిటీ?"

"ఆమ్మో...."

రోడ్డు మలుపు తిర్గింది. మరో ఫర్లాంగు.. ఫర్లాంగు పదియోజనాల్లా ఊహ..

మళ్ళీ చూసింది.... చిత్రం

"లేడు.. ఏడీ.. ఏమయిపోయాడు ?"

ఎందుకింత ఆతృత.... వెంటపడే జులాయి వాడికోసం.

ఎందుకో ? 'ఊహు చెప్పలేదు తను'

అక్కడే....

చూపే అంచుకి దొరికిపోయాడు....

పక్కనే పక్కగా నడుస్తున్నాడు.

పాపం సౌజన్య.

పైటకొంగుని మరింతగా బిగదీసుకుంది.. ధైర్యాన్ని కూడగట్టుకునే ప్రయత్నం.

బిగించిన పైటకొంగు బిగువులకి మరింత అందం.

అడుగడుక్కీ పాలసముద్రంలో చిన్నఅల.

అలా వచ్చిన అల.... నడుముచివర కలిసిపోయిన ఆవంపు.... ఓహ్.... చూపు సమాధయిపోతుందక్కడ.


ప్రఖ్యాతి చెందిన!

ఖటావ్ మిల్లు వారి

★ 100% పాలియష్టర్ చీరలు

★ ఫుల్‌వాయిల్, ఆఫ్ వాయిల్ చీరలు

★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు

★ డ్రస్ మెటీరియల్సు, 2×2 రూబియాలున్ను

★ స్కూలు యూనిఫారంలు – వగైరాలకు

విజయ షోరూమ్

ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్

J.D. హాస్పటల్ రోడ్డు,

గవర్నరుపేట ........ విజయవాడ-2


మగవాడి గుండెలో మరో ప్రళయం .... మరో భూకంపం.

సౌజన్యా ది గ్రేట్.

ఊహల్లో సెగ రగులుతుంటోంది.. ధైర్యం నీరయి ఆవిరయిపోతోంది సౌజన్యకు.

"ఎందుకలా పెళ్ళికూతుర్లా నడుస్తారు ?"

మనసంతా అదే ఆలోచనయితే మాటలు వాటంతటవే విచ్చిస్తాయి.

చూసింది సౌజన్య.

ఇటే చూస్తున్నాడు.... కళ్ళతోనే కవ్వింపులు

"నీతో ఏడడుగులూ నడిచేసాను" అన్నట్లు మందస్మితం

తనతోపాటే వస్తున్నాడు

మెల్లిగా... మెల్లిగా.... తడబడితే..తడబాటు.

వెకిలి వేషాలెయ్యడంలేదు.

డిగ్నిఫయిడ్ టీజర్ !

అప్రయత్నంగా నవ్వు వాలికింది పెదవుల మీదనుంచి సౌజన్యకి.

సౌజన్య నవ్వింది ! మెరుపు మెరిసినట్లు.. ముత్తెపు చిప్ప విచ్చుకున్నట్టు.

కలువలు కుడివైపుకి తిరిగాయి. కిటారు తలుపులు రెపరెపలాడాయి.... గాలి కెరటం బుగ్గమీద అలా తట్టి వెళ్ళిపోయింది.... వెన్ను ఝల్లుమంది.

'ఆహ్వానమా ?' మరో భ్రమ.

"ఊహూం ! కాదు" గట్టిగానే అంది.

ఆకులు కొమల్ని పట్టుకుని వేలాడుతూ కదలకుండా నిశ్శబ్దంగా ఈ చోద్యాన్ని చూస్తున్నాయి.

ముప్పావునగరం మంచి మత్తునిద్రలో ఉంటే ఇక్కడ ఈ దోబూచులాట !

అవకాశం దొరికినవాడు ఎందుకు ఆలస్యం చేస్తున్నాడో ?



**చైతన్య స్రవంతి**

బహిరంగసభ జరుగుతోంది.

వలర్ధ నాయకుడు, మంత్రివికుంభకాడు ఆవేశంగా ప్రసంగిస్తున్నారు.

"సమాజాన్ని చైతన్యస్రవంతిగా మార్చాలంటే మన మేం చెయ్యాలి?" అన్నారు.

"వలర్ధ నాయకులు సన్యసించాలి" అన్నాడు యువక ప్రేక్షకుడు.

వై. ఆంజనేయులు. (చేర్యాల)

ఇంటికిముందు మూడు ట్యూబ్ లైట్లులేవు.

మూడులైట్ల మధ్య ముచ్చట తీర్చేసుకుంటాడా ?

"అమ్మో...." సౌజన్యకు నడుస్తున్నట్టుగా లేదు.

ఇంటి గుమ్మం లీలగా కనిపిస్తోంది.

ఇంటికి గుట్టుగా చేరితే చాలు.

మనసులో పుట్టుకొచ్చే భయం మొక్కులు చెల్లించేస్తోంది, లంచంగా కొబ్బరికాయలు దేవుడికి.

తననుతనే ఓదార్చుకుంటోంది సౌజన్య.

మూడులైట్లూ దాటిపోయాయి.

తలుపు తెరుచుకోగానే.... ఇంట్లోకి అడుగు పెట్టడం.... అమ్మను తోసేసి దఢేలుమని తలుపు మూసేయడం.... అంతా ఓ క్షణకాలం.... కంగారు.... తలుపు మూస్తున్నప్పుడు వాడు చూస్తున్న చూపు.

"రాస్కెల్"

"ఎవరే?" పార్వతమ్మకు అర్థం కాలేదు ఆ రాస్కెల్ ఎవరో....

"ఆఁ ఏంలేదు" అనేసి.... అయిదు నిముషాలు కుర్చీలో కూలబడి .... కూలబడిన అయిదు నిముషాలు తిట్టుకుని తిట్టుకుని.... అలసిపోయి అలాగే నిద్రలోకి జారిపోయింది.

* * *

అదేవిటే.... అలా కుర్చీలో నిద్ర పోతున్నావ్?" తట్టిలేపుతోంది పార్వతమ్మ.

"ఆమాటా.... ఈమాటా చెప్పి ఇదిగో....


Bhagavathi

MIXER CUM GRINDER

- POWERFUL MOTOR @ 450 WATTS & CAN BE OPERATED FOR 45 CONTINUOUS MINUTES
- BLADE UNIT FIRMLY FIXED
- STAINLESS STEEL JAR PROVIDED
- EXTRA STRONG ALUMINIUM BODY TO AVOID NOISE
- AVAILABLE IN ATTRACTIVE COLOURS

SOLE DISTRIBUTORS FOR A. P.

GOPAL ENGINEERING AGENCIES

4-3-278, OLD BHOIGUDA, SECUNDERABAD-3.

PH. P. P. 821670



ఇంతవరకూ కూచోబెట్టేసిందే.... నడిచొచ్చాను కాళ్ళుపీకుతున్నాయ్.... భోంచేసే వచ్చాన్లే".

"తొమ్మిది గంటల్నించీ ఇంకా రాలేదేవి టావి అటూ ఇటూ తిరగలేక ఛస్తూనే ఉన్నా మీ నాన్న ఓహాటే గొడవ.... పర్లే నాకు నిద్రొస్తోంది గానీ బట్టలుమార్చుకుని పడుకో వెళ్ళి" అంటూ వెళ్ళిపోయింది పార్వతమ్మ.

నీరసం కదలనివ్వడంలేదు. మంచినిద్రలో లేపిందేమో? చిరాగ్గా ఉంది. మెల్లిగా లేచి బట్టలు మార్చుకుని గదిలో మంచం మీద వాలిపోయింది సౌజన్య.

మెల్లగా మూసుకున్న కళ్ళు చల్లబడ్డాయి. రెప్పలపై మంచు కురుస్తున్న అనుభూతి మల్లెపూలు కుప్పలుగా పడుతున్న మెత్తదనం. మరో లోకంలోకి తీసుకుపోతున్న ఊహలతో మెల్లిగా కళ్ళు తెరిచింది సౌజన్య. కవలలు విచ్చుకున్నట్టు.

ఎదురుగా కిటికీ

కిటికీలోంచి వాడే అవును వాడే వెంటపడ్డవాడు. వెన్నెలతో చల్లని రాయబారం పంపించి తట్టిలేపుతున్నాడు.

అదేనవ్వు. అదేచూపు.

'నాచుట్టూ ఇన్ని చుక్కలున్నా నువ్వే నచ్చావ్' అన్నట్టు.

ఆ కవ్వింపునకు తట్టుకోలేక "అమ్మ దొంగా, ఇక్కడున్నావా?" అని మనసులో అనుకుని ముసిముసిగా నవ్వుకుని సిగ్గుతో ముఖాన్ని దిండులో దూర్చేసింది.

నింగిలోని చందమామ మబ్బుల చాటున—
నేలపైని చందమామ దిండుచాటున. ❋


## ఆదిత్యా సాహితీ పజిల్

గెలవండి 3,500 లు

ఆదిత్య సాహితి పజిల్‌యందు పాల్గొన్నవారికి ఉచిత బహుమతితో పాటు ఒక ప్రైజ్ గ్యారంటీ.

వివరములకు వ్రాయండి:

ఆదిత్యా సాహితి పజిల్

బాలాజీవీధి, నిజామాబాద్-503001



## హల్లో ! ఒక క్షణం ఆగి ఆలోచించండి

కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ స్కూల్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలలో రాష్ట్రంలో మొదటి ఆరు స్థానాలు "శ్రీ విద్యావిహార్. ఆదర్శ గురుకుల విద్యాసంస్థ ఎలా కైవసం చేసుకోగలిగారు? పరీక్షలలో నూటికి నూరు శాతం విజయాలను ఎలా సాధించగలిగారు? సంస్థ ప్రతి సంవత్సరమూ అనుకొన్న లక్ష్యాలను ఎలా సాధించగలుగుతుంది?

లక్ష్య సాధనకు కఠోర పరిశ్రమకు మించినదిలేదని మా అభిప్రాయం. విద్యార్థులు నడువవలసిన పద్ధతిలో నడిపి, విద్యా వినయ సంపన్నులుగా తీర్చిదిద్దినట్లయితే ఉత్తమ ఫలితాలు తప్పక లభిస్తాయి అనే మా నమ్మకం ఎన్నడూ వమ్ముకాలేదు.

ఈ సంవత్సరము యిలాంటి విజయాలను ఎన్నింటినో సాధించాలని ఉత్సాహంగా ముందుకు సాగుతున్న మాకు పూర్వముకన్న ఇతోధికంగా మీ అండదండలు అందచేసి మా పురోగమనానికి, మీ చిన్నారుల చక్కటి భవిష్యత్తుకు పూలబాటలు వేయటానికి సదా మీ ఆదరాభిమానాలు కాంక్షించుచున్నాము.

### ఆలోచించి వెంటనే చేర్చండి

స్థాపితం : 1962 ఫోన్ : 22084



## శ్రీ విద్యావిహార్

(ఆదర్శ గురుకుల విద్యా సంస్థ)

రింగ్‌రోడ్, లలితానందనగర్,

(నవభారత్ గెస్ట్ హౌస్ దగ్గర)

గుంటూరు-522006

పట్టణ వాతావరణమునకు దూరముగా ప్రశాంత వాతావరణములో బాల బాలికలకు ఇంటిని మరపించు చక్కని హాస్టలు వసతి గలదు.

సైనిక స్కూలు కోరుకొండ, డెహరాడూన్ మిలిటరీ కాలేజీ, హైదరాబాద్, ఋషివాలీ మరియు ఇతర రాష్ట్రములలోగల పబ్లిక్ స్కూల్సు స్కాలర్‌షిప్ పరీక్షలు, తాడికొండ, సర్వేల్లి, కొడిగన్‌హళ్లి, వికారాబాద్ రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూల్సు ప్రవేశ పరీక్షలకు మొదలగు కాంపిటీటివ్ పరీక్షలకు శిక్షణ నిచ్చుటలో పేరెన్నికగన్న దక్షిణభారత దేశమునందలి ప్రప్రథమ సంస్థ

### నర్సరీ నుండి 10వ తరగతి వరకు

ఇంగ్లీషు మరియు తెలుగు మీడియంలో బోధన

స్థానికులకు స్కూలు బస్సు సౌకర్యము కలదు.

వివరములకు వెంటనే ప్రాస్పెక్టస్‌కై వ్రాయండి.

ప్రిన్సిపాల్ — యం. వి. పూర్ణచంద్రరావు

డైరెక్టర్ — యం. వి. రామకృష్ణారావు